# రూ.2 లక్షలు పైబడిన వారికి కూడా రుణమాఫీ చేస్తాం

- ఏదైనా కారణంతో రుణమాఫీ జరగకపోతే వివరాలు సేకరిస్తామన్న తుమ్మల
- రుణమాఫీ సమస్యలు ఉంటే బ్యాంకు, నోడల్ అధికారులను సంప్రదించాలని సూచన
- గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బకాయిలను చెల్లించినట్లు వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, రూ.2 లక్షలు పైబడిన వారికి కూడా మాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఏదైనా కారణంతో ఎవరికైనా రుణమాఫీ జరగకపోతే -మిగతా 5లో


# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం 18 ఆగస్టు 2024 పేజీలు 8


# "హైడ్రా" కాపాడిన ఎర్రకుంటను.. దత్తత ఇవ్వండి

హైడ్రా చర్యలతో ఎర్రకుంటలో అక్రమ నిర్మాణాలు నేలమట్టం అయిన దృశ్యం..



- బాచుపల్లి రెవెన్యూ అధికారులకు బీజేపీ ఆధ్వర్యంలో కాలనీ వాసుల విన్నపం..
- చెరువును అభివృద్ధి చేయండి.. లేదా కాలనీలకు అప్పగించండి..
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రత్యేక చొరవతో కాపాడిన ఎర్రకుంట..



ఎర్రకుంట అభివృద్ధిపై బాచుపల్లి డిప్యూటీ తహశీల్దార్‌కి వినతిపత్రం..



బాచుపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్,ఆగష్టు 17: ఎర్రకుంట చెరువు మరోసారి కబ్జాకు గురికాకుండా ప్రభుత్వం నుండి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షించాలని.. బీజేపీ ఆధ్వర్యంలో కాలనీ వాసులు,శనివారం బాచుపల్లి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి సర్వే నెంబర్ 134 ఎర్రకుంటకు గతంలో మూడు ఎకరాలకు ఫెన్సింగ్ రక్షణ వలయంగా ఉండేదని..! కానీ గత టీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో ఆక్రమణకు గురైందని బీజేపీ నేత ఆకుల సతీష్ శనివారం పత్రికా సమావేశంలో ఆరోపించారు.. -2లో

# గ్రామీణ మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

హైదరాబాద్ పెన్ పవర్: గ్రామీణ మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు మంత్రి సీతక్క. గ్రామీణ మహిళల్లో లీడర్ షిప్, ఎంపవర్ మెంట్ పెంపొందించడంపై డెమోక్రాటిక్ సంస్థ నిర్వహించిన కార్యక్రమానికి సీతక్క, కాంగ్రెస్ నాయకురాలు గీతారెడ్డి, సినీ నటి రెజీనీ కసండ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీతక్క.. మహిళలు ఎంచుకునే రంగం స్పష్టంగా ఉండాలన్నారు. లక్ష్యాలు స్పష్టంగా ఉన్నప్పుడే టార్గెట్ రీచ్ అవుతామన్నారు. కొంత మంది ముందుకొచ్చిన ప్రతిసారీ వెనక్కి లాగేవాళ్లుంటారని అన్నారు. డబ్బులున్నవాళ్లే రాజకీయాల్లో రాణిస్తుంటారు.. రాజకీయాల్లోకి రావాలనుకునేవాళ్లకు ఇది ఇబ్బందేనన్నారు సీతక్క. సినిమా వేరు..రాజకీయం వేరని చెప్పారు.



# రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై 72 శాతం మంది ప్రజల సంతృప్తి

## పల్స్ ఆఫ్ పీపుల్ సర్వే

- పాలన పట్ల 21 శాతం మంది ప్రజల అసంతృప్తి
- పాలనపై ఏమీ చెప్పలేమన్న 7 శాతం మంది
- రాష్ట్రవ్యాప్తంగా 9,665 శాంపిల్స్ సేకరణ

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలోని 72 శాతం మంది ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిగా ఉన్నారని 'పల్స్ ఆఫ్ పీపుల్' సర్వేలో వెల్లడైంది. ఈ సర్వేను తెలంగాణ కాంగ్రెస్ నేతలు స్వాగతించారు. తమ పార్టీ ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని, తమ ప్రభుత్వం పని తీరుకు ఈ సర్వే నిదర్శనమని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇటీవల ' -2 లో



# "హైడ్రా" కాపాడిన ఎర్రకుంటను.. దత్తత ఇవ్వండి..




ఎర్రకుంట సర్వే నెం.134ను ప్రభుత్వ భూమిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గేటు.. ఫైల్ ఫోటో..



ప్రస్తుతం ఎర్రకుంట కూల్చివేతల స్థానంలో.. గతంలో ఇలా ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఉండేది..ఆరేళ్ళక్రితం ఫైల్ ఫోటో..

## అభివృద్ధి చేయండి లేదా.. కాలనీలకు దత్తత ఇవ్వండి..

బాచుపల్లి మండలం ప్రగతి నగర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 134 ఎర్రకుంట చెరువు, మరోసారి కబ్జాకు గురి కాకుండా,రక్షణ వలయంగా తక్షణమే ఫెన్సింగ్ వేయాలని బాచుపల్లి డిప్యూటీ తహశీల్దార్‌కి బీజేపీ నేత ఆకుల సతీష్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు.. చెరువుగా అభివృద్ధి చేయాలని, ఒకవేళ అధికారులు చేయలేకపోతే..! జిపిఆర్ అండ్ లెజెండ్ కాలనీ వాస్తులకు దత్తత ఇస్తే చెరువు మొత్తానికి ఫెన్సింగ్ వేసి చెరువులో పూడిక తీసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి ప్రజా అవసరాలకు రక్షించి వినియోగిస్తామని సతీష్ అన్నారు.. ఈ సందర్భంగా బిజెపి నిజాంపేట్ మాజీ అధ్యక్షులు ఆకుల సతీష్ మాట్లాడుతూ ప్రగతి నగర్, సర్వేనెంబర్ 134లో 3.03 ఎకరాల స్థలంలో ఎర్రకుంట చెరువు (ID: 2800/E/17) ఈ చెరువుని ప్రభుత్వ స్థలమని మరియు చెరువుగా హెచ్ఎండిఏ ప్రాథమిక సర్వేలో గుర్తించి 2016లో, మ్యాప్స్‌ను వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేశారని అన్నారు..ఈ ఎర్రకుంట స్థలానికి చుట్టూ ఐరన్ ముల్లతీగను ఫెన్సింగ్‌గా అమర్చారు.. ప్రభుత్వ స్థలమని గేటుపై రాసి ఉన్నది నేటికీ చూడవచ్చు..

### ప్రజా అవసరాలకు వినియోగించండి..

ప్రభుత్వ భూమి ఎర్రకుంట చెరువు మరొకసారి గురి కాకుండా చూడాలని.! జిపిఆర్ లెజెండ్ కాలనీ ప్రజలతో కలిసి అభివృద్ధి చేయడానికి ముందుకు వస్తున్నారని..! ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి చెరువుని దత్తత ఇస్తూ ఉత్తర్వులు జారీచేస్తే, తాము అభివృద్ధి చేసి కాపాడటంతో పాటు, ప్రజల వినియోగంలోకి తీసుకొచ్చి భవిష్యత్ తరాలకి ఎర్రకుంట చెరువు భద్రంగా ఉంటుందని అన్నారు.. ఎర్రకుంట చెరువును అభివృద్ధి చేయడానికి అనుమతి కోరారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, గోల్ల కృష్ణ, ఎల్ల స్వామి, అరుణ్ రావు,ఈశ్వర్ రెడ్డి, లెజెండ్ కాలనీ ముఖేష్, శ్రీకాంత్ జిపిఆర్ లేఔట్ రమణారెడ్డి,గురునాధ్ రెడ్డి, శ్యామ్, రాకేష్, తిరుపతిరెడ్డి, అనీష్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం తమదే ఉందన్న అహంకారంతో, అధికారులను మేనేజ్ చేసి తప్పుడు ఎన్‌ఓసిలు, నిర్మాణ అనుమతులు జారీచేసి అధికార దుర్వినియోగానికి ఒడిగట్టారని సతీష్ విమర్శించారు.. కమిషనర్ నుండి కలెక్టర్ వరకు ఫిర్యాదులు చేసినా, చర్యలు తీసుకోకపోవడంతో..

చివరికి హైడ్రాను సందర్శించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.. ఎర్రకుంట కబ్జాను హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఐపీఎస్ సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించి..! 24 గంటల్లోనే కూల్చి కూల్చివేసి చెరువును కబ్జాల నుండి రక్షించి చరిత్రను తిరగరాశారని అన్నారు..

# రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై 72 శాతం మంది ప్రజల సంతృప్తి

అగ్ని న్యూస్ సర్వీస్' 8 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై సర్వేను నిర్వహించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోందని సర్వేలో పాల్గొన్న ఎక్కువమంది ప్రజలు వెల్లడించారు. ఈ సర్వేపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'ఐఎఎన్ఎస్'తో మాట్లాడుతూ... ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ క్రెడిట్ అంతా రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. ప్రభుత్వం తమ పార్టీ అగ్రనాయకత్వం మార్గదర్శకత్వంలో ముందుకు సాగుతోందన్నారు.'పల్స్ ఆఫ్ పీపుల్ ఇన్ తెలంగాణ' పేరుతో నిర్వహించిన సర్వేలో 72 శాతం మంది కాంగ్రెస్ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేయగా, 21 శాతం మంది అసంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొన్న వారిలో 7 శాతం మంది ఏమీ చెప్పలేమని వెల్లడించారు.సర్వేలో పాల్గొన్న వారిలో 55 శాతం మంది రేవంత్ రెడ్డి పనితీరు చాలా అద్భుతంగా ఉందన్నారు. 7 శాతం మంది చాలా బాగుందన్నారు. 10 శాతం మంది బాగుందని చెప్పారు. ఎనిమిది శాతం మంది మాత్రం బాగాలేదని చెప్పగా, ఇరవై శాతం మంది ఏమీ చెప్పలేమన్నారు.అగ్ని న్యూస్ సర్వీస్ ప్రతినిధి ఆర్ సురేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ సర్వేను ఆగస్ట్ 1 నుంచి ఆగస్ట్ 10 మధ్య నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 9,665 శాంపిల్స్ తీసుకున్నారు. తెలంగాణలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఈ సర్వే నిర్వహించారు. ఉద్యోగులు, వ్యాపార వర్గాలు, శ్రామిక వర్గాలు, విద్యార్థులు, పురుషులు, మహిళలు పాల్గొన్నారు. ఎనిమిది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు అంచనాలకు మించిందని సురేశ్ కుమార్ తెలిపారు. రేవంత్ రెడ్డి రాణించగలరా? అనే భయాలు అన్ని వర్గాల్లో కనిపించాయని, కానీ సర్వే ఫలితాల్లో ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు తేలిందన్నారు.

# తప్పుడు లెక్కలతో..కాంగ్రెస్ రుణమాఫీ..

## కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపణలు..





**దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 17:** అబద్ధపు మాటలతో, అసత్య ప్రచారపు పునాదులపై కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గండిమైసమ్మ చౌరస్తాలో భౌరంపేట్ సహకార సంఘం బ్యాంక్ ముందు రైతు రుణమాఫీపై ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ భౌరంపేట్, దుందిగల్ కి చెందిన రైతులతో తమ నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం డిసెంబర్ 9 లోపు అందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం..! రాష్ట్రవ్యాప్తంగా రూ.2 లక్షల రుణమాఫి చేశామని చెబుతూ రైతాంగాన్ని నట్టేటా ముంచిందని ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ఎద్దేవా చేశారు. బౌరంపేట్,దుండిగల్ బ్యాంక్‌లో 632 మంది రైతులు రుణం పొందితే కేవలం 14 మంది రైతులకు 4.30 లక్షలు మాత్రమే బుణమాఫీ అయ్యిందని, మిగతా 618 మంది రైతులకు 2.95 కోట్ల రుణాలను మాఫీచేయాలని, లేని యేడల మోసపూరిత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పి గద్దెదిగాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

రైతుభరోసా రాష్ట్ర వ్యాప్తంగా పత్తా లేదన్నారు. తెలంగాణ రైతులందరికి డిసెంబర్ 9 నుండి ఆగస్ట్ 15 లోగా రెండు లక్షల రుణమాపి చేస్తానని మాయమాటలు చెప్పిన రేవంత్ సర్కార్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి సంబంధించి నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం ఐదు శాతం మంది రైతులకు మాత్రమే రుణమాపి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేష్, డైరెక్టర్లు భీమ్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, జీతయ్య, కృష్ణ, సత్తిరెడ్డి, ఈ. శ్రీనివాస్, రైతులు పీసరి నర్సిరెడ్డి, భరత్ రెడ్డి, బద్ధం శంకరయ్య, పీసరి కరుణాకర్ రెడ్డి, ఆకుల ఈశ్వరయ్య, నాచారం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




## అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

### మహిళలపై దాడులును శిక్షించుటకు ప్రత్యేక చట్టాలు తేవాలి

### ఏఐటీయూసీ మండల అధ్యక్షులు రాయపూడి రాజేష్ డిమాండ్

**భద్రాదికొత్తగూడెం జిల్లా, పెన్ పవర్, ఆగష్టు 17:** కోల్ కత్తాలో వైద్యురాలపై జరిగిన హత్యను నిరసిస్తూ శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షులు రాయపూడి రాకేష్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాయపూడి రాజేష్ ఇటీవల కోల్ కత్తాలో జరిగిన అత్యాచారం, హత్యను తీవ్రంగా ఖండించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దుర్ఘటన యావత్ భారతావని నివ్వెరపోయేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంకీర్తన, శిరీష, లక్ష్మి, హాస్పటల్ స్టాఫ్, సిస్టర్స్, తదితరులు పాల్గొన్నారు




## అంగన్వాడీ కేంద్రం.. నూతన భవనాలు ప్రారంభం

మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ ఆగస్టు 17 : నాగారం మున్సిపాలిటీలోని నాగారం, రాంపల్లిలో రూ.43 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాలను నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు మొదటి గురువుగా అంగన్వాడీ టీచర్లు బాధ్యత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్, కౌన్సిలర్లు చింతల సరిత రమేష్, ఎలిజాల నగేష్ గౌడ్, గోక కళావతి యాదగిరి, బదనాపురం శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు అశోక్ గౌడ్, ఆదం షఫీక్, డీఈఈ సుదర్శనం రఘు, ఏఈ నరేష్ కుమార్, మేనేజర్ కె. చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్స్పెక్టర్ రాంరెడ్డి, అంగన్వాడీ టీచర్లు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# శిఖర స్కూల్లో రక్షాబంధన్ వేడుకలు









దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్ శిఖర స్కూల్లో సేవా మిత్రులతో నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమానికి బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు పారిశుద్ధ కార్మికులకు రాఖీ కట్టి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటు కావాలని తెలియజేయడంకోసం ప్రతిరోజు ప్రజలు బాధ్యతరాహితంగా ఇళ్ల పక్కన వీదుల్లో, చౌరస్తాల పైన ఎక్కడ పడితే అక్కడ చెత్తవేయడం వలన పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడమే కాకుండా కార్మికులను దూశించడం జరుగుతుందని, దీనివలన కార్మికులు ధర్నా చేస్తే ఆ తరువాత జరిగే పరిణామాలు ఎలా ఉంటాయో తెలియజేసేందుకు నాటకం వేసి చూపించారు. ఈ కార్యక్రమంని ఉద్దేశించి బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాఖీ కట్టేటప్పుడు రక్షాబంధన్ మంత్రం హేన బద్ధో బలి రాజా దానవేంద్రో మహా బల దేనత్వమభిబద్నామి రాక్షే మాచల మాచల అని మంత్రం చెప్పి వారితో రక్ష కట్టించుకోవాలని, మంత్ర విశిష్టతను తెలియజేశారు. ప్రతి రోజూ ఉదయాన్నే ప్రజలు లేవకముందే రోడ్లు శుభ్రం చేసి ఎక్కడైనా డ్రైనేజీ జామైతే శు భ్రం చేసి వారు చేసే సేవలను గుర్తు చేస్తూ వారిని గుర్తించి విద్యార్థులచే సన్మానించడం ప్రజలకు మేలుకొలుపు చేయడం పట్ల స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుచ్చిరెడ్డి, మురళీయాదవ్, మహేందర్ రెడ్డి స్కూల్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్‌పై అత్యాచార.. నిందితులను కఠినంగా శిక్షించాలి..







**ఆర్.ఎం.పి., పి.ఎం.పి డాక్టర్ల డిమాండ్..**

**కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన, నివాళులు..**


**డాక్టర్లకు రక్షణ కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్..**

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 17:** ఈ నెల ఆగస్టు 9వ తారీఖున పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కోల్ కత్తాలో వైద్య విద్యార్థిని డ్యూటీలో ఉన్న సమయంలో కొంతమంది అగాంతకులు సామూహిక హత్యాచారానికి పాల్పడి హత్య చేసిన సంఘటనకు నిరసనగా కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ హుస్సేన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్ఎంపీ మరియు పియంపి డాక్టర్ల బృందం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ సర్కిల్ సాయిబాబా నగర్ లో ర్యాలీ నిర్వహించి నివాళులులర్పించారు.. ఈ సందర్భంగా కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎండి హుస్సేన్ మాట్లాడుతూ రోజురోజుకి మహిళలపై కామాంధుల అరాచకాలు పెరిగిపోతున్నాయని, 78 సంవత్సరాలు ఈ స్వతంత్ర భారతదేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దిశా, నిర్భయ, ఫోక్సో ఇలా ఎన్ని చట్టాలు వచ్చినప్పటికీ ఎటువంటి రక్షణ లేదని చట్టాలన్నీ డబ్బున్న వారి చేతుల్లో చుట్టాలుగా మారుతున్నాయని తెలిపారు. తల్లి జన్మనిస్తే డాక్టర్లు పునఃర్జన్మణిస్తున్నారని అటువంటి డాక్టర్స్ పై లైంగిక వేధింపులు జరపడం చాలా బాధాకరమన్నారు. నిందితులను తక్షణమే శిక్షించి వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా మహిళా ఆర్ఎంపీ డాక్టర్లు మాట్లాడుతూ విద్యార్థులపై మహిళలపై అత్యాచారానికి

పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలి పెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హత్యాచారం చేసిన నిందితులకు అమ్మాయిలపైన మహిళలపైన అత్యాచారం చేస్తే ఈ విధంగా శిక్షలు ఉంటాయా అని తెలిసే విధంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.. ఈ నిరసన కార్యక్రమంలో ఆర్ఎంపీ మరియు పియంపి డాక్టర్లు సాంబశివరావు, బాల లింగం, షౌకత్, విగ్నేష్, చక్రధర్, స్వరూప, కరీమున్నీసా, రాణి, లక్ష్మీ, ఆసిఫా తదితరులు పాల్గొన్నారు

# రూ.10 లక్షల విలువైన..హాష్ ఆయిల్ స్వాధీనం..

## నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన బాలానగర్ పోలీసులు..






**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 17:** పక్క రాష్ట్రంలో తక్కువ ధరకు హష్ ఆయిల్ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్న నింధితుడిని బాలనగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.. షాపూర్ నగర్‌లోని బాలనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ సురేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ "యాంటీ నార్కోటిక్స్ బ్యూరో", బాలనగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.10 లక్షలు విలువచేసే హాష్ ఆయిల్ పట్టుబడింది.. డీసీపి సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా హాష్ ఆయిల్‌ను విక్రయిస్తున్న అల్ల సింహాచలం (27) అనే వ్యక్తిని అరెస్ట్ చేసి పోలీసులు అతని నుండి రూ.10 లక్షల 33 వేల విలువ గల 1292 గ్రాముల హాష్ ఆయిల్ (258బాటిల్స్) నుస్వాదీన పరుచుకుని సంబంధిత వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. గత రెండేళ్ల నుండి అరకులో తక్కువ ధరకు హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న సింహాచలం, హైదారాబాద్‌కు తీసుకొచ్చి ఎక్కువ ధరకు అమ్ముతున్నాడని, నిందితుడి వద్ద నుండి యూసఫ్ గూడాకు చెందిన షిండే, సాయి చరణ్, బన్నీ ఉదయ్ భాను, అమీర్ పెట్‌కు చెందిన రాపర్తి ఉదయ్, ఉప్పల్‌కు చెందిన వికాస్ అనే నలుగురు కొనుగోలు దారులను గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆల్ల సింహాచలంతో పాటు మరో ఏడుగురు డ్రగ్ సప్లయర్స్ పరారీలో ఉన్నారని డిసిపి సురేష్ కుమార్ తెలియజేశారు..

# రూ.2 లక్షలు పైబడిన వారికి కూడా రుణమాఫీ చేస్తాం

- మొదటి పేజి తరువాయి

వివరాలు సేకరిస్తామని, ఆ వివరాలు పోర్టల్‌లో అప్ లోడ్ చేయాలని అధికారులకు ఇప్పటికే సూచించామన్నారు. రుణమాఫీకి సంబంధించి ఇంకా ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే బ్యాంకు, వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద నియమించిన నోడల్ అధికారులను సంప్రదించాలని సూచించారు.శనివారం నల్గొండలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రూ.2 లక్షల లోపు ఉన్న రైతు రుణాలను మాఫీ చేశామన్నారు. ఇప్పటి వరకు 22 లక్షలకు పైగా రైతుల్లో రుణమాఫీ నిధులు జమ చేశామన్నారు. రూ.17,933 కోట్ల నిధులు విడుదల చేసినట్లు చెప్పారు.

రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం రూ.26,140 కోట్లు ఖర్చు చేసిందన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బకాయిలన్నీ చెల్లించామని తెలిపారు. సూక్ష్మసేద్యం, ఆయిల్‌ఫామ్, పలు రాయితీ బకాయిలు చెల్లించామన్నారు. తమది చేతల ప్రభుత్వమని, దిగజారుడు రాజకీయాలు తమకు రావన్నారు.

# బస్సు కిందికి దూసుకెళ్లిన ఆటో... హబ్సిగూడలో టెన్త్ విద్యార్థిని దుర్మరణం



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన ఆటో ఆర్టీసీ బస్సు కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. తీవ్ర గాయాలపాలైన ఆటో డ్రైవర్ ను స్థానికులు, పోలీసులు ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం హబ్సిగూడలో ఈ ప్రమాదం జరిగింది. ఆటోను ఓ ట్రక్కు ఢీకొట్టగా... అదుపు తప్పిన ఆటో ఓ బస్సు కిందికి దూసుకెళ్లింది. దాంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ఆటో డ్రైవర్ ఎల్లయ్యతో పాటు అందులో ప్రయాణిస్తున్న పదో తరగతి విద్యార్థిని సాత్విక తీవ్రంగా గాయపడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు... పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు.. క్రేన్ సాయంతో బస్సు కింద చిక్కుకున్న ఆటోను బయటకు తీశారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ కాసేపటికే సాత్విక ప్రాణాలు కోల్పోయింది. డ్రైవర్ ఎల్లయ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

# తొమ్మిదేళ్లుగా కడుతున్న బ్రిడ్జి... ముచ్చటగా మూడోసారి కూలింది...

## బీహార్ లోని భాగల్పూర్ జిల్లాలో ఘటన

## సుల్తాన్ గంజ్ – అగువాని గంగా నదిపై నిర్మాణం

## ఇప్పటికే రూ.1717 కోట్లు వెచ్చించిన సర్కారు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీహార్ లో ఓ బ్రిడ్జి నిర్మాణం తొమ్మిదేళ్లుగా కొనసాగుతూ ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం దీనిపై రూ.1717 కోట్లు వెచ్చించింది. ఇప్పటికే రెండు సార్లు కూలిన ఈ బ్రిడ్జి శనివారం మరోమారు కూలిపోయింది. నిర్మాణంలో ఉండగానే ఇన్నిసార్లు కూలిన బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యాక ఎన్నిరోజులు నిలుస్తుందని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని భాగల్పూర్ జిల్లాలో సుల్తాన్ గంజ్ – అగువాని గంగా నది రూట్ లో ప్రభుత్వం ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది

నాలుగు లేన్లతో నిర్మిస్తున్న ఈ బ్రిడ్జి తొమ్మిదేళ్లు గడిచినా పూర్తికాకపోవడంతో ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు కట్టిన వాటిలో రెండు పిల్లర్లు కూడా కూలిపోవడంపై నిపుణులు మండిపడుతున్నారు.

కాగా, ఖగరియా జిల్లా కలెక్టర్ ఈ ఘటనపై స్పందిస్తూ.. వంతెన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదనే విమర్శలపై పాట్నా హైకోర్టు స్పందించి, నిర్మాణ పనులపై స్టే ఇచ్చిందన్నారు. ఇప్పటికే పూర్తయిన భాగాన్ని కూడా కూల్చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించిందని చెప్పారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా వంతెన కూల్చివేత పనులు చేపట్టారని వివరించారు.

ఖగరియా, భాగల్పూర్ జిల్లాలను కలుపుతూ గంగా నదిపై నిర్మిస్తున్న ఈ బ్రిడ్జి కాంట్రాక్టును ఎస్పీ సింగ్లా కంపెనీ దక్కించుకుంది. 2014 లో నిర్మాణ పనులు చేపట్టింది. నిర్మాణం పూర్తిచేయడానికి ప్రభుత్వం విధించిన గడువును ఎనిమిదిసార్లు పొడిగించింది. 2022 లో వచ్చిన తుపాను కారణంగా నిర్మాణం దెబ్బతింది. ఆ తర్వాత కూడా బ్రిడ్జి కూలిపోవడంతో నాణ్యతపై సందేహాలు వ్యక్తమయ్యాయి.

## కేటీఆర్ పేరు జోసెఫ్ గోబెల్స్.. ఆయన చెప్పేవన్నీ అబద్ధాలే: ఎంపీ చామల

**ప్రతిపక్షం ఎలా ఉండాలో పక్క రాష్ట్రాల్లో చూసి నేర్చుకోండి**

**భువనగిరి ఎంపి చామల కిరణ్? కుమార్ రెడ్డి**




**హైదరాబాద్ పెన్ పవర్:** కేటీఆర్ పేరు జోసెఫ్ గోబెల్స్ అని, ఆయన చెప్పేవన్నీ అబద్ధాలేనని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఇవాళ గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షం ఎలా ఉండాలో పక్క రాష్ట్రాల్లో చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ఒక జెడ్పీటీసీగా రాజకీయ జీవితం ప్రారంభించిన రేవంత్ రెడ్డి సీఎం అయితే తప్పేంటన్నారు. సామాన్యులెవరైనా ముఖ్యమంత్రులు కావచ్చని చెప్పారు. వాళ్లు ఐదేండ్లలో దఫదఫాలుగా రుణమాఫీ చేయవచ్చు కానీ.. తాము 25 రోజుల్లో రుణమాఫీ చేస్తే తప్పేంటన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూనే.. మరో వైపు ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు పోతున్నామని అన్నారు.

## బీఆర్ఎస్ రుణమాఫీ చేస్తే రైతులకు వడ్డీకి కూడా సరిపోలేదు: ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి

**కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రుణమాఫీ ఎందుకు చేయలేదో చెప్పాలని నిలదీత**

**రుణమాఫీ చేశాకే హరీశ్ రావు రాజీనామాను అడుగుతున్నామని వెల్లడి**

**మంచి చేసి ఉంటే బీఆర్ఎస్‌ను ఎందుకు ఓడించారో చెప్పాలని నిలదీత**



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన రుణమాఫీ... రైతులకు కనీసం వడ్డీ చెల్లించడానికి కూడా సరిపోలేదని, కానీ ఇప్పుడు తాము ఎనిమిది నెలల కాలంలోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ పూర్తి రుణమాఫీ ఎందుకు చేయలేదో చెప్పాలన్నారు. 2018లోనూ మరోసారి రుణమాఫీ హామీ ఇచ్చారని, కానీ 2023 వరకు గత ప్రభుత్వానికి రైతులు గుర్తుకు రాలేదని విమర్శించారు. తాము రుణమాఫీ హామీని నిలబెట్టుకున్న తర్వాతే హరీశ్ రావును రాజీనామా చేయమని అడుగుతున్నామని పేర్కొన్నారు. కానీ ఆయన నాటకాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి చేసి ఉంటే బీఆర్ఎస్‌ను ప్రజలు ఎందుకు ఓడించారో చెప్పాలని నిలదీశారు.

# నామినేటెడ్ పదవులకోసం భారీగా దరఖాస్తులు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, అమరావతి ఆగస్టు 17:** ప్రభుత్వ శాఖల్లో నామినేటెడ్ పదవుల కోసం టిడిపి కార్యాలయానికి భారీగా దరఖాస్తులు చేరుకున్నాయి. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పదవుల కోసం నేతలు తమ దరఖాస్తులను పార్టీ కార్యాలయంలో అందజేశారు పార్టీలో తాము చాలా కష్టపడ్డామని, ఆర్థికంగా నష్టపోయామని, తమపై కేసులు కూడా ఉన్నాయని దరఖాస్తుల్లో చూపుతున్నారు. వీటితోపాటు ఎమ్మెల్యేలు, మంత్రులు, సీనియర్ నేతల సిఫార్సుల లేఖలను కూడా జత చేస్తున్నారు. నామినేటెడ్ పదవులు కేటాయించాలని ఇప్పటి వరకు సుమారు 23 వేల దరఖాస్తులు పార్టీ కార్యాలయానికి వచ్చాయి. భారీగా దరఖాస్తులు రావడంతో వీటిని వడపోసే కార్యక్రమం టిడిపి చేపట్టింది. అందరికీ ఎలా సర్దుబాటు చేయాలనే అంశంపై తీవ్ర కసరత్తు చేస్తోంది. దీని కోసం పది మందితో ఒక కమిటీని పార్టీ అధిష్టానం ఏర్పాటు చేసింది. ప్రోగ్రామ్స్ కమిటీ నుంచి వచ్చిన దరఖాస్తులను ఈ కమిటీ పరిశీలించి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వద్దకు తీసుకెళ్తున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ వడపోత తరువాత ఎవరికి ఏ పదవులు దక్కుతాయో స్పష్టత ఉంటుందని అంటున్నారు.

**సీట్లు కోల్పోయిన వారికే తొలి ప్రాధాన్యత :**

టిడిపి-బిజెపి జనసేన పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేసిన నేతలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని టిడిపి అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పొత్తులో భాగంగా 31 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. వీరితోపాటు ఇతరుల కోసం సీట్లు త్యాగం చేసిన వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ఆ తరువాత పార్టీకి ఆర్థికంగా విరాళాలు అందించిన వారిని కూడా పరిశీలించాలని చూస్తోంది.

**సెప్టెంబరులోపు పూర్తి చేయాలనే లక్ష్యం:**

నామినేటెడ్ పదవుల మొత్తాన్ని సెప్టెంబరులోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో చంద్రబాబు, లోకేష్ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తయినా, ఇప్పటి వరకుఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదనే అసంతృప్తి నాయకులు, కార్యకర్తల్లో ఉందని అధినాయకులు భావిస్తున్నారనిపార్టీ నేతలు అంటున్నారు. కాబట్టి వీలైనంత త్వరగా భర్తీ చేయాలనిచూస్తున్నారు. తొలిదశ జాబితా వారంలోపు వచ్చే అవకాశం ఉంటుందని నేతలు చెబుతున్నారు. రాష్ట్ర స్థాయిలో సుమారు 103 కార్పొరేషన్లు ఉన్నాయి. ఒక్కొక్క దానిలో ఛైర్మన్తోపాటు 11 మందికి డైరెక్టర్లుగా నామినేట్ చేసుకునే అవకాశం ఉంది. తద్వారా 1,130 మంది వరకు నామినేట్ చేసుకునే అవకాశం ఉంది. ఇవి కాకుండా మరో 300 పదవులు ఉండే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. జిల్లాల్లో గ్రంథాలయ సంస్థలు, మండల స్థాయిలో మార్కెట్ యార్డు కమిటీ పదవులు కూడా ఉన్నాయి. మొత్తం సుమారు 2,500 మందికి నామినేటెడ్ పదవులు దక్కే అవకాశం ఉంటుందని నేతలు చెబుతున్నారు.

# ముందు సాగిలా... సరిపోయారు..ఇద్దరు..

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, హైదరాబాద్, ఆగస్టు 17:** ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకుంటే ఎంత డేంజరో ఆర్థిక నిపుణులను ఎవరిని అడిగినా చెబుతారు. తాము ఇచ్చిన నిధులకు లెక్కా పత్రాలతో చెప్పడమే కాకుండా సంక్షేమ పథకాలకు కూడా కోత పెడుతుంది. ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు తీసుకుంటే ఒక రకంగా మన పిలక వారి చేతుల్లో ఉన్నట్లేనని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు రెండు తెలుగడు రాష్ట్రాలు ప్రపంచబ్యాంకు విషకౌగిలిలోకి చేరేందుకు సిద్ధమవుతున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో చర్చించారు. అంటే రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధులిస్తే ఇక వారి పెత్తనమే కొనసాగుతుందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి... మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో సమావేశమయ్యారు. కొద్ది రోజుల క్రితం ఆయన జరిపిన అమెరికా పర్యటనలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో చర్చలు జరిపారు. వివిధ ప్రాజెక్టులకు రేవంత్ రెడ్డి నిధుల కోసం చర్చలు జరిపారు. ప్రజారోగ్య రంగానికి, హైదరాబాద్ 4.0, మూసీ ప్రక్షాళన, స్కిల్ యూనివర్సిటీ వంటి వారికి నిధులు ఇవ్వాలని కోరారు. నిధులు ఇచ్చేందుక ప్రపంచ బ్యాంకు ఎలాంటి అభ్యంతరాలుండవు. వడ్డీతో సహా నిధులను ముక్కుపిండి వసూలు చేస్తుంది. పైగా తాము చెప్పిన రంగాలకే నిధులను కేటాయించాలంటూ షరతులను విధించడంలో ప్రపంచ బ్యాంకు ఎప్పుడూ వెనకాడదు నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో... గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు తెచ్చుకున్నారు. అనేక సంస్కరణలను చేపట్టేందుకు వీటిని తీసుకున్నట్లు చెప్పారు.

కానీ తర్వాత చంద్రబాబు ప్రజలపై పన్నుల భారం మోపాల్సి వచ్చింది. విద్యుత్తు నుంచి అన్ని రకాల పెన్నులు పెంచిన చంద్రబాబు నాడు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. ముఖ్యంగా కమ్యునిస్టు పార్టీల ప్రపంచ బ్యాంకు నుంచి రుణం పొందడానికి అస్సలు అంగీకరించవు. పెద్దయెత్తున ఉద్యమం చేసేవి. ప్రపంచ బ్యాంకును రాష్ట్రానికి తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారంటూ కామ్రేడ్లు కన్నెర్ర చేశారు. ఫలితంగా చంద్రబాబు రెండు దఫాలు అధికారానికి దూరం అవ్వాల్సి వచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి కానీ, అనంతరం రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన కేసీఆర్ ప్రభుత్వం కానీ ప్రపంచ బ్యాంకు నిధుల జోలికి వెళ్లలేదు. ఎఫ్ఆర్ఎంబీ నిబంధనల మేరకు దేశీయ రుణాలను మాత్రమే తీసుకునే వారు. దీంతో సంక్షేమ పథకాల్లో కోత ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ బ్యాంకు జపం చేయడాన్ని ఆర్థిక నిపుణులు తప్పుపడుతున్నారు. ఇక రెండు రాష్ట్రాల్లో కమ్యునిస్టులు కూడా వీటిపై పెదవి విప్పడం లేదు. తెలంగాణలో కమ్యునిస్టులు కాంగ్రెస్ తో జతకట్టగా, ఏపీలో మాత్రం చంద్రబాబు ప్రభుత్వాన్ని కామ్రేడ్లు ప్రశ్నించే సాహసం చేయలేకపోతున్నారన్న మాట మాత్రం వాస్తవం

# ప్రపంచ బ్యాంకు 14 క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, హైదరాబాద్, ఆగస్టు 17:** పొలిటికల్‌గా రచ్చరేపిన ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో ఎట్టకేలకు ముందడగు పడింది. 2020లో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లకు మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పేక మేడలు కాదు. ఇల్లీగల్ కన్‌స్ట్రక్షన్స్. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేతల పర్వం మొదలైంది. హైడ్రా ఆపరేషన్ అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. మరోవైపు లే -అవుట్ రెగ్యూలరైజేషన్ స్కీమ్.. ఎల్‌ఆర్‌ఎస్ పై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లే అవుట్స్, ప్లాట్స్ క్రమబద్ధీకరణకు మరో ఛాన్స్ ఇచ్చింది. కాకపోతే కండీషన్స్ అప్లయ్. 2020 అక్టోబర్ 15లోపు దరఖాస్తు చేసుకున్న వాళ్లకే క్రమబద్ధీకరణ అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు సంబంధిత అధికారులు. 131, 135 జీవో నెంబర్ల ప్రకారం రాష్ట్రాల అక్రమ లే-అవుట్స్, ప్లాట్స్ రెగ్యూలరైజషన్ కోసం 2020లో నియమ నిబంధనలు జారీ అయ్యాయి. 2020 ఆగస్టు26 కన్నా ముందు రిజిష్టర్ చేసిన లే అవుట్లకు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. గైడ్‌లైన్స్ 2020లోనే విడుదలైనా దరఖాస్తుల పరిశీలన గత జనవరి నుంచే మొదలైంది. ఇప్పటి వరకు 4లక్షల 28వేల 832 అప్లికేషన్లను స్క్రూట్నీ చేశారు. 60 వేల 2వందలకు పైచిలుకు దరఖాస్తులకు ఆమోద ముద్ర పడింది. తద్వారా ఫీజుల రూపేణ సర్కార్ ఖజానాలో 96 కోట్ల 60 లక్షలు జమయ్యాయిమరి మిగతా అప్లికేషన్ల మాటేంటి? దాదాపు 75 శాతం దరఖాస్తులకు ఆమోద ముద్రం పడకపోవడానికి కారణం..సరైన డాక్యుమెంట్లు సమర్పించకపోవడం..సమగ్ర వివరాలు పొందుపర్చకపోవడం. అలాంటి వారికి ఇప్పుడు మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ , లే-అవుట్ కాపీలను జతపరిస్తే మళ్లీ ఆ దరఖాస్తులను పరిశీలిస్తారు. మొబైల్ ద్వారా కూడా డాక్యుమెంట్స్‌ను అప్‌లోడ్ చేయవచ్చు. లేదంటే మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ ఆఫీసుల్లో స్వయంగా
ఇవ్వొచ్చు. సలహాలు సూచనల కోసం హెల్ప్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు అధికారులు. కాంగ్రెస్ సర్కార్ అధికార పగ్గాలు చేపట్టిన కొత్తలోనే ఎల్‌ఆర్‌ఎస్ పై రాజకీయ రచ్చ రాజుకుంది. అధికారంలోకి రాగానే ల్యాండ్ రెగ్యూలరైజేషన్‌ను ఫ్రీగా చేస్తామన్న హామీని నిలపెట్టుకోవాలని బీఆర్ఎస్ ఆందోళనలు చేపట్టింది. మరోవైపు, మాటేంటే మాటేనన్న కాంగ్రెస్ సర్కార్ ఎల్ ఆర్ ఎస్ అమలు కోసం విధి విధానాలపై ఫోకస్ పెట్టింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దాఖలైన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని.. సిబ్బంది కొరత వుంటే ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మొత్తానికి దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. 60 వేల 2వందల అప్లికేషన్లకు ఆమోదం లభించింది. మిగతా వారికి మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఐతే 2020 అక్టోబర్ 15లోపు దరఖాస్తు చేసుకున్న వాళ్లకే క్రమబద్ధీకరణ అవకాశం కల్పించారు.

# రికార్డు బద్దలు కొట్టిన దేవర

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, హైదరాబాద్, ఆగస్టు 17:** ఆర్ఆర్ఆర్ వంటి భారీ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఎన్టీఆర్ కొరటాల శివతో 'దేవర' చిత్రం చేసిన సంగతి మన అందరికీ తెలిసిందే. కొరటాల శివ కి ఈ చిత్రానికి ముందు ఆచార్య లాంటి ఘోరమైన డిజాస్టర్ ఉంది. ఇంత చెత్తగా ఈ సినిమాని కొరటాల శివ ఎలా చేసాడు?, అసలు నిజంగా ఆయనే దర్శకత్వం వహించాడా? వంటి సందేహాలు చూసిన ప్రతీ ప్రేక్షకుడికి కలిగింది. ఇక కొరటాల శివ పని అయిపోయింది, ఎన్టీఆర్ అంత పెద్ద పాన్ ఇండియన్ బ్లాక్ బస్టర్ తర్వాత ఇలాంటి డైరెక్టర్ కి అవకాశం ఎలా ఇచ్చాడో అని అభిమానులు సైతం భయపడ్డారు. కానీ కొరటాల శివ 'దేవర' చిత్రాన్ని ఎంతో కసిగా తీసాడు అని ఈ సినిమా నుండి విడుదల అవుతున్న ప్రమోషనల్ కంటెంట్ ని చూస్తుంటే అర్థం అవుతుంది. గత ఏడాది విడుదల చేసిన గ్లిమ్స్ వీడియో ని చూసి ఫ్యాన్స్ తో పాటుగా ఇతర హీరోల అభిమానులు కూడా షాక్ అయ్యారు. ఆచార్య లాంటి సినిమా తీసిన కొరటాల వెంటనే ఈ రేంజ్ సినిమా ఎలా తీసాడు అని అందరూ ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత ఈ సినిమా నుండి విడుదలైన మొదటి పాట సెన్సేషనల్ హిట్ అయ్యింది. సోషల్ మీడియా లో ఎక్కడ చూసినా ఈ పాటనే వినపడుతూ ఉండేది. ఇక రీసెంట్ గా విడుదలైన 'చుట్టమల్లే' లిరికల్ వీడియో సాంగ్ కూడా బంపర్ అయ్యింది. రోజురోజుకి ఈ పాటకి యూట్యూబ్ లో మిలియన్ల కొద్దీ వ్యూస్ పెరుగుతూ పోతున్నాయి. ఈ పాట విడుదలై కేవలం 11 రోజులు మాత్రమే అయ్యింది. ఈ 11 రోజులకు గానూ యూట్యూబ్ లో 5 భాషలకు కలిపి 100 మిలియన్ కి పైగా వ్యూస్ వచ్చాయి. ఒక్క తెలుగులోనే 69 మిలియన్ వ్యూస్ రాగా, హిందీ లో 21 మిలియన్ వ్యూస్ వచ్చాయి. అలాగే తమిళం మలయాళం మరియు కన్నడ భాషలకు కలిపి ఓవరాల్ గా 100 మిలియన్ వ్యూస్ ఈ పాటకి వచ్చాయి. ఎన్టీఆర్ కెరీర్ లో ఈ మధ్య కాలం లో ఈ రేంజ్ బ్లాక్ బస్టర్ ఆల్బం రాలేదు. త్వరలోనే ఈ సినిమాకి హైలైట్ గా నిలవనున్న 'ఆయుధ పూజ' పాటని విడుదల చెయ్యబోతున్నారు. ఈ పాట ఇప్పటి వరకు వచ్చిన రెండు పాటలకు మించి ఉంటుందని, సౌత్ ఇండియా మొత్తం మారుమోగిపోయ్యే రేంజ్ లో హిట్ అవుతుందని మేకర్స్ అంటున్నారు. ఈ పాట తో పాటుగా విలన్ సైఫ్ అలీ ఖాన్ మీద కూడా ఒక పాట ఉంటుంది. ఇది కూడా వచ్చే వారం లో విడుదల చేయబోతున్నట్టు తెలుస్తుంది. విడుదలకు ముందే దేవర లో ఎలాంటి కంటెంట్ ఉండే కొరటాల శివ చూపించేసి అంచనాలను పెంచేసాడు. మరి ఆ అంచనాలను అందుకుంటాడా లేదా అనేది తెలియాలంటే సెప్టెంబర్ 27 వ తేదీ వరకు ఆగాల్సిందే.

## ఆడపడుచులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి..

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ ఖమ్మం ఆగస్టు 17:** మహిళలు ఆర్టీసీ బస్సుల్లో బ్రేక్ డాన్సులు రికార్డింగ్ డాన్స్ చేయి చేసుకోవచ్చని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయని రాష్ట్ర గిడ్డంగలు సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు విమర్శించారు..ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దోబ్బల సౌజన్య ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనంచేశారు.. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ..కేటీఆర్ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కేటిఆర్ తక్షణమే మహిళలకు బహిరంగ క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు..ఆడవాళ్లు బస్సుల్లో కుట్లు అల్లికలు చేసుకుంటే తప్పేంటి, సమయం వృధా చేయకుండా పనిచేసుకోవడం తప్పా అని ప్రశ్నించారు.. కేటీఆర్ పై కేంద్ర, రాష్ట్ర మహిళా కమిషన్లు కేసు నమోదు చేయాలని కోరారు.. కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోండి గతంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మీకు బుద్ధి చెప్పిన మీకు బుద్ధి రావట్లేదు రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్ ఎన్నికల్లో ప్రజలు మీకు బుద్ధి చెప్తారు..ఇప్పటికైనా మీ అహంకారమైన మాటలు మానుకోని మహిళలకు బహిరంగ క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు..

## విద్యుత్ షాక్ తో ఒరిస్సా యువకుడు మృతి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ ఖమ్మం ఆగస్టు 17:** ఖమ్మం జిల్లా మధిరలో పేరడైజ్ రెస్టారెంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రెస్టారెంట్లో పని చేస్తున్న ఒరిస్సా కు చెందిన యువకుడు షేఫ్ నిజాముద్దీన్ ( 22 ) అక్కడికక్కడే మృతి చెందాడు. ఫ్రిజ్లో ఆహార పదార్థాలు తీసేటప్పుడు ఫ్రిడ్జ్ విద్యుత్ షాక్ కు గురై యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫ్రూట్ సలాడ్ లో పురుగులు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, వికారాబాద్ ఆగస్టు 17:** వికారాబాద్ జిల్లా తాండూరులో మిలాప్ జ్యూస్ సెంటర్ లో ఒక కస్టమర్ ఫ్రూట్ సలాడ్ ఆర్డర్ చేసాడు. ఫ్రూట్ సలాడ్ లో పురుగులను గుర్తించి అధికారులకు సమాచారం అందించాడు. అధికారులు వచ్చి జ్యూస్ సెంటర్ ను సీజ్ చేసారు.

## హబ్సీగూడ లో ఘోర రోడ్డు ప్రమాదం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, మేడ్చల్ ఆగస్టు 17:** హబ్సీగూడలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక లారీ ఆటోను ఢీకొట్టింది. ఘటనలో ఆటో ఒక బస్సు కిందకు దూసుకెళ్లింది. ఆటో డ్రైవర్, ఆటోలో ఉన్న విద్యారిని కి తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా వుంది. క్రేన్ సహాయంతో ఆటోను తొలగించి గాయాల అయిన వారిని ఆసుపత్రికి తరలించారు. చిన పోలీసులు

## అత్తాపూర్ లో పోలీసుల నాకాబంది

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ రంగారెడ్డి ఆగస్టు 17:** రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని అత్తాపూర్, హసన్ నగర్ ప్రాంతాల్లో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ సారథ్యంలో పోలీసుల నాకాబంది నిర్వహించారు.150 మంది సిబ్బందితో పోలీసుల కార్డెన్ సర్చ్ జరిగింది. నాలుగు బెల్ట్ షాపులను గుర్తించారు. 29 లీటర్ల మద్యం, ఆటోలో తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేని 90 వాహనాలు సీజ్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు.

## పిల్లలతోపాటు వివాహిత ఆత్మహత్య

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ అన్నమయ్య ఆగస్టు 17:**రాయచోటి పట్టణం కొత్తపేట లో దారుణం జరిగింది. తన నివాసంలోనే తన ఇద్దరు పిల్లలతో కలిసి రమా(35) అనే వివాహిత పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. రమా, తన ఇద్దరు పిల్లలు మను(7), మన్విత(5) మంటల్లో కాలి చనిపోయారు. కొత్తపేటలోని తొగటవీధి లో ఘటన జరిగింది.మృతురాలి భర్త రాజా జీవనోపాధి కోసం మూడేళ్ల క్రితం కువైట్ కి వెళ్ళినట్లు సమాచారం. రమా కొత్తపేటలోని ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని అతని భార్య రాత్రి 10 గంటల సమయంలో రమా ఇంటికి వెళ్లి దాదాపు 5 గంటల సేపు రమా తో గొడవ జరిగిందని స్థానికులు అంటున్నారు.
అవమానం భరించలేక తెల్లవారుజామున తన పిల్లలతో పాటు రమా పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. .

## తన అధికారిక నివాసంపై దాడులు ఖండించిన ఎమ్మెల్యే హరీష్ రావు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ సిద్దిపేట ఆగస్టు 17:**సిద్దిపేట ఎమ్మెల్యే అధికారిక నివాసంపై అర్ధరాత్రి కాంగ్రెస్ నేతలు దాడి చేసి తాళాలు పగలగొట్టి, ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం దారుణమని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. ఈ దాడిని అడ్డుకోవాల్సిన పోలీసులే దుండగులను రక్షించడం మరింత శోచనీయం. ఒక ఎమ్మెల్యే నివాసంపైనే ఇంత దారుణంగా దాడి జరిగిందంటే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? పోలీసుల సమక్షంలో ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం కాంగ్రెస్ మార్క్ పాలనకు నిదర్శనం. వెంటనే ఈ ఘటనపై తెలంగాణ డీజీపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## సిద్దిపేట లో అర్ధరాత్రి హైడ్రామా

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ సిద్దిపేట ఆగస్టు 17:**సిద్దిపేటలో శుక్రవారం అర్ధరాత్రి హై డ్రామా నడిచింది. హరీష్ రావు రాజీనామా చేయాలన్న ఫ్లెక్సీల ఏర్పాటుతో వివాదం రాజుకుంది. 2 లక్షల రుణమాఫీ అయ్యింది..హరీష్ రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేత పూజల హరికృష్ణ ఫ్లెక్సీలు పెట్టారు. ఫ్లెక్సీలను తీసేయ్యడానికి బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారు. కాంగ్రెస్, బీఆరెస్ కార్యకర్తలు రోడ్డుపైకి అర్ధరాత్రి భారీగా చేరుకున్నారు. పోటాపోటీ నినాదాలతో కాసేపు టెన్షన్ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులోకి కాంగ్రెస్ కార్యకర్తలు చొచ్చుకెళ్లారు. టిఆర్ఎస్ ఫ్లెక్సీలు ధ్వంసం చేసారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పోలీస్ స్టేషన్ కి తరలించారు.

# రాఖీ కట్టే సమయం.. ముహూర్తం ఇదే...

రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమకు ప్రతీకగా ఉండే పండుగ. ఈ ఏడాది ( 2024) ఆగస్టు 19 సోమవారం వచ్చింది. అన్నాచెల్లెళ్ల మధ్య బంధం =వ చెక్కు చెదరకుండా ఉండాలంటే శుభ ముహూర్తంలో మాత్రమే రాఖీ కట్టాలి. ఈ ఏడాది రక్షాబంధన్?(రాఖీ ) శుభముహూర్తం ఏ సమయంలో కట్టాలో తెలుసుకుందాం. . . .
శ్రావణ మాసం వ్రతాలు, పూజలు, పెళ్ళిళ్ళకే కాదు.. అన్నా చెల్లెళ్లకు, అక్కా తమ్ములకు కూడా చాలా ప్రత్యేకమైన మాసం. శ్రావణ పూర్ణిమ రోజే రాఖీ పూర్ణిమ జరుపుకుంటారు. ఈ రోజు అక్కా చెల్లెళ్ల తమ సోదరులకు రక్షగా, వారు ఎప్పుడూ సంతోషంగా, క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాఖీని కడతారు. అయితే రాఖీ కట్టడానికి ఒక నిర్దేశిత సమయం ఉంది. రాఖీ పౌర్ణమి రోజు వచ్చే భద్రకాలాన్ని ఆ రోజు పరిగణలోకి తీసుకుంటారు. భద్రుని నీడ ఉన్న సమయంలో రాఖీ కట్టకూడదని అంటారు.
ఈ ఏడాది రక్షాబంధన్‌పై భద్ర ఛాయలు కమ్ముకుంటున్నాయి. రాఖీ రోజున సోదరీమణులు సోదరుడి రాఖీ కట్టి అతని ఉజ్వల భవిష్యత్తును కోరుకుంటారు. రాఖీ ( కట్టిన తర్వాత సోదరుడు సోదరికి ఎల్లప్పుడూ రక్షిస్తానని హామీ ఇస్తాడు.

**రక్షాబంధన్ తేదీ:**
పంచాంగ్ ప్రకారం.. ఈ సంవత్సరం శ్రావణ మాసంలోని శుక్ల పక్ష పౌర్ణమి ఆగస్టు 19 సోమవారం తెల్లవారుజామున 03:04 నుంచి ప్రారంభమవుతుంది. ఈ తేదీ ఆగస్టు 19 రాత్రి 11:55 గంటలకు ముగుస్తుంది. శ్రావణ పూర్ణిమ నాడు రక్షాబంధన్ జరుపుకుంటారు.



**అనుకూల సమయం..**
ఈ సంవత్సరం రక్షాబంధన్ నాడు ఆగస్ట్ 19న మధ్యాహ్నం 2:07 నుంచి రాత్రి 08:20 వరకు రాఖీ కట్టడానికి అనుకూలమైన సమయం. ప్రదోష కాలంలో సాయంత్రం 06.57 నుంచి 09.10 గంటల వరకు రాఖీ కట్టడం శుభప్రదం. అయితే రక్షాబంధన్ పండుగను ఉదయం పూట జరుపుకునే వారు ఈ సారి ఉదయం నుంచి మధ్యాహ్నం 01.32 గంటల వరకు రాఖీ కట్టలేరు. ఈ సమయంలో భద్రుడు ఉంటాడు. భద్రకాలం ఎప్పటి వరకు ఉంటుంది.
రక్షాబంధన్ నాడు ఉదయం 5:53 గంటలకు భద్ర ప్రారంభ సమయం. ఆ తర్వాత మధ్యాహ్నం 1:32 వరకు కొనసాగుతుంది. ఈ భద్ర పాతాళలోకంలో ఉంటాడు. రక్షాబంధన్ సమయంలో రాఖీ కట్టే ముందు భద్ర కాలాన్ని ఖచ్చితంగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇది అశుభకరమైనదిగా చెబుతారు.

**భద్రకాలంలో రాఖీ కట్టడం అశుభం**
పురాణాల ప్రకారం.. రక్షాబంధన్ పండుగను భద్రకాలంలో జరుపుకోకూడదు అనేది భద్ర కాలంలో రాఖీ కట్టడం శ్రేయస్కరం కాదు. భద్ర కాలంలో లంక పాలకుడు రావణుడికి అతని సోదరి రాఖీ కట్టింది. అదే సంవత్సరంలో రాముడి చేతిలో రావణుడు చంపబడ్డాడు. అందుకే భద్ర కాలంలో రాఖీ కట్టారని పండితులు చెబుతున్నారు.

**రక్షాబంధన్ ప్రాముఖ్యత**
ప్రతికూలత, దురదృష్టం నుంచి రక్షించడానికి రక్షాబంధన్ ముడిపడి ఉంది. రక్షాబంధన్ ధరించిన వారి ఆలోచనలు సానుకూలంగా, మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. రక్షాబంధన్ ఇప్పుడు రాఖీ రూపంలోకి వచ్చినప్పటికీ దాని ఉద్దేశ్యం అన్నాచెల్లెళ్ల బంధాన్ని బలంగా ఉంచుతుందని నమ్ముతారు.

# పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ హెచ్చరిక... అప్రమత్తంగా లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనట!

**ఐటీఆర్ రిఫండ్ స్కామ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

**అనధికార, అనుమానాస్పద ఈ-మెయిల్స్ పై క్లిక్ చేయవద్దన్న ఐటీ శాఖ**

**ఆదాయ పన్ను శాఖ ఇచ్చిన ఈ-మెయిల్ ద్వారా మాత్రమే సంప్రదింపులు జరపాలని సూచన**

ఐటీఆర్ రిఫండ్ స్కామ్స్ పట్ల ఆదాయపు పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా ఉండాలని ఐటీ శాఖ హెచ్చరించింది. నకిలీ కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఒకవేళ పన్ను చెల్లింపుదారులకు ఫేక్ సందేశాలు వస్తే గుడ్డిగా నమ్మి మోసపోవద్దని, అధికారిక ఛానళ్ల ద్వారా నిర్ధారించుకోవాలని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా హెచ్చరించింది.
"అనధికార, అనుమానాస్పద ఈ-మెయిల్స్‌పై క్లిక్ చేయవద్దు. అలాగే వాటికి ఎలాంటి సమాధానం ఇవ్వవద్దు. మీ క్రెడిట్ కార్డు నంబర్లు, బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ఏదైనా ఇతర విలువైన సమాచారాన్ని అడిగే వెబ్‌సైట్లను ఓపెన్ చేయవద్దు. ఆదాయ పన్ను శాఖ ఇచ్చిన ఈ-మెయిల్ చిరునామా ద్వారా మాత్రమే




సంప్రదింపులు జరపాలి" అని ఐటీ డిపార్ట్‌మెంట్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.
ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చే మెసేజ్‌లు ఎలా ఉంటాయో కూడా ఐటీ శాఖ తెలిపింది. "మీకు రూ.15000 ఆదాయపు పన్ను రిఫండ్ అప్రూవ్ అయ్యింది. ఈ మొత్తం త్వరలో మీ ఖాతాకు జమ అవుతుంది. దయచేసి మీ ఖాతా నంబర్ 5XXXXXX6777ను ధృవీకరించండి. ఇది సరైనది కాకుంటే, ఇక్కడ ఇచ్చిన లింకుపై క్లిక్ చేసి మీ బ్యాంక్ అకౌంట్ సమాచారాన్ని అప్‌డేట్ చేయండి" అని ఆ స్కామర్ల నుంచి సందేశం లేదా మెయిల్ రావచ్చని ఆదాయపు పన్ను విభాగం హెచ్చరించింది. అలాంటి సందేశాలకు ఎట్టిపరిస్థితుల్లో స్పందించవద్దని సూచించింది.

**మోసపూరిత ఈ-మెయిల్స్‌పై ఫిర్యాదు చేయడం ఇలా..**
మోసపూరిత ఈ-మెయిల్ వస్తే, మీరు దానిని webmanager@incometax.gov.in కు పంపించాలి. అలాగే ఒక కాపీని incident@cert-in.org.in కూడా పంపవచ్చు. మీకు ఫేక్ మెయిల్ వస్తే, దానిని incident@cert-in.org.in కు పంపించండి అని ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది. ఇక ఆదాయపు పన్ను శాఖ అని చెప్పుకునే ఎవరి నుంచైనా ఈ-మెయిల్ లేదా ఫోన్ కాల్ వస్తే వాటికి సమాధానం ఇవ్వొద్దని సూచించింది.
అలాగే ఈ- మెయిల్ లో ఏదైనా అటాచ్‌మెంట్లు ఉంటే, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని, సందేశం లింక్ ను కట్ చేసి మీ బ్రౌజర్లలో పేస్ట్ చేయవద్దని హెచ్చరించింది. అలాగే ఓటీపీ, పాస్‌వర్డ్, ఆధార్ వంటి సున్నితమైన సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లో స్కామర్లకు వెల్లడించవద్దని తెలిపింది.

**ఐటీ రీఫండ్ ఎప్పుడు వస్తుందంటే!**
పన్ను చెల్లింపుదారులు ఐటీ రిటర్న్‌లను ఈ-వెరిఫై చేసిన తర్వాతే ఆదాయపు పన్ను రిఫండ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అలాగే సాధారణంగా రిఫండ్ బ్యాంక్ ఖాతాల్లో జమ కావడానికి దాదాపు 4-5 వారాల సమయం పడుతుంది. ఒక వేళ 'డిఫెక్టివ్ ఐటీఆర్' నోటీస్ వస్తే, దానిని మళ్లీ కరెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది.